క్లుప్తంగా

క్రిస్టియన్ల ర్యాలీ



పొదలకూరు: మణిపూర్‌లో దాడులకు నిరసనగా పొదలకూరులో గురువారం క్రిస్టియన్లు, పాస్టర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. క్రిస్టియన్లపై దాడులను వెంటనే ఆపాలన్నారు. ఈ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు లక్కు స్వరాజ్, పాస్టర్లు పాల్గొన్నారు.

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం జరిగింది.

సోమిరెడ్డి మళ్లీ ఓడిపోవడం ఖాయం



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాచలం: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లిలో పోటీ చేస్తే మళ్లీ ఓడిపోవడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు కడివేటి శివ, ఉప్పు అశోక్, మందా కృష్ణ అన్నారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుడ్లూరువారిపాళెం టీడీపీ నాయకుడు ఈపూరు సుబ్బారెడ్డి పంచాయతీ పైపులైన్లు ధ్వంసం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వరుస ఓటములతో దిక్కుతోచని స్థితిలో ఉన్న సోమిరెడ్డి తన ఉనికి కోసం నీచరాజకీయాలకు పాల్పడుతూ నవ్వుల పాలవుతున్నాడని విమర్శించారు. సుబ్బారెడ్డి గురించి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య వాస్తవాలు మాట్లాడితే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతూ తప్పుడు ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. నాయకులు చీకుర్తి నరసయ్య, సురేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ న్యాయ సలహాదారుడి నియామకం



నెల్లూరు(లీగల్): పోలీస్ శాఖ జిల్లా న్యాయ సలహాదారుడిగా రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ తుమాటి శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

‘చంద్రబాబు, పవన్ డ్రామాలాడుతున్నారు’



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ వైపే..
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ‘వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ డ్రామాలాడుతున్నారు. అయితే వారికి అధికారం దక్కదు. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారు.’ అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 16, 17వ వార్డుల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రసన్న నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సమస్యలను ఆరా తీశారు. 90 వేల ఇళ్ల సందర్శన పూర్తయిన సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా జరుగుతుండడంతో బాబు, పవన్ ఓర్వలేక సీఎంను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వారెన్ని కలలు కన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రతి ఎమ్మెల్యే ప్రజల మధ్యనే ఉంటున్నారని గుర్తుచేశారు. ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

అపూర్వ స్పందన

గత సంవత్సరం ఆగస్టు ఒకటో తేదీన మండలంలోని జొన్నవాడలో కామాక్షితాయి అమ్మవారు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో గడప గడపకు కార్యక్రమాన్ని చేపట్టామని ప్రసన్న తెలిపారు. అప్పటి నుంచి దిగ్విజయంగా నిర్వహిస్తూ 90 వేల ఇళ్లను సందర్శించామన్నారు. ప్రతి కుటుంబం నుంచి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. తల్లిదండ్రుల్లేని పిల్లలు, ఆదరణ కోల్పోయిన వృద్ధులు, దివ్యాంగులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని చూసి చలించిపోయానన్నారు. వారికి తన తండ్రి పేరు మీద ఉన్న నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా సహాయం చేశానని తెలిపారు. గడప గడపకు కార్యక్రమం విజయవంతానికి అన్ని శాఖల అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు సహకారం మరువలేనిదన్నారు.

లబ్ధిదారులకు రుణాలు

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బ్యాంక్ ద్వారా రుణాలను ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే చాలామందికి రుణాలు అందజేశామన్నారు. ఇందులో భాగంగా మరొకరికి మెప్మా ఆధ్వర్యంలో రుణాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జునరెడ్డి, నాయకులు పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

‘టేక్ హోం రేషన్’ అద్భుత కార్యక్రమం



కొడవలూరు: సంపూర్ణ పోషణ కిట్‌ను అందజేస్తున్న చలపతిరావు

- డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం టేక్ హోం రేషన్ అనే అద్భుత కార్యక్రమానికి డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు కొనియాడారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా టేక్ హోం రేషన్ కిట్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద భోజనాన్ని వడ్డించేవారన్నారు. ఈ కార్యక్రమాన్ని వందశాతం మంది సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఇంటికే కిట్ల రూపంలో బియ్యం, పప్పు, నూనె అందించడం వల్ల ప్రతి ఒక్కరూ వినియోగించుకొనే వెసులుబాటు కలిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, వైద్యాధికారి ఎం.రామకృష్ణ, ఎంపీపీ జి.జ్యోతి, ఏసీడీపీఓ ఎస్.అరుణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు వి.పద్మావతి, టి.నాగభూషణమ్మ, ఎస్.నిర్మల, సర్పంచ్ కామాక్షి, ఎంపీటీసీ ప్రతాప్, విజయా డెయిరీ, డీఎల్‌డీఏ డైరెక్టర్లు ఐ.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎం.మల్లికార్జున, సర్పంచ్ ఎం.రంగారెడ్డి, నాయకులు ఆర్.రాజేష్‌రెడ్డి, ఒట్టూరు సునీతమ్మ, పి.రవి, ఎస్.తిరుపతమ్మ పాల్గొన్నారు.

- **మనుబోలు:** తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తోందని కొమ్మలపూడి సర్పంచ్ బందెల వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమ్మలపూడి, మడమనూరు, పిడూరు మిక్స్‌డ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం టేక్ హోం రేషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఆదినారాయణమ్మ, రమణమ్మ, కార్యదర్శి పవన్, అంగన్‌వాడీలు సంతోషమ్మ, సీతారామమ్మ, రమణమ్మ, మహిళా పోలీస్‌లు పవిత్ర, సునీత, నాయకుడు జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలోని రేబాల దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలను అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల అన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి శ్యామ్, సచివాలయ సిబ్బంది ప్రవీణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.
- **ముత్తుకూరు:** తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కోళ్లమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలలో అనేక పోషకాలు ఉన్నట్లు చెప్పారు. అనంతరం గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ బ్రహ్మదేవి క్లస్టర్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ, ఉపసర్పంచ్ బ్రహ్మానందం, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్‌ఎం శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, పోలమ్మ పాల్గొన్నారు.
- **ఇందుకూరుపేట:** మండలంలోని రావూరులో గురువారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. స్థానిక సర్పంచ్ ఉడతా వెంకట శేషయ్య వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. అలాగే నిడిముసలి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష ఆధ్వర్యంలో జరిగిన వారోత్సవాల్లో సర్పంచ్ దువ్వూరు పావని, నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొని కిట్లను అందజేశారు.



మనుబోలు : కిట్ అందజేస్తున్న సర్పంచ్ వేణు



మనుబోలు: కిట్ అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: రేబాలలో తల్లిపాల వారోత్సవాలు



ముత్తుకూరు: మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసులు



ఇందుకూరుపేట: రావూరులో కిట్ అందజేస్తున్న దృశ్యం

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

- సెబ్ సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు: చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని, లేకపోతే భవిష్యత్‌కు ముప్పు ఏర్పడుతుందని సెబ్ సీఐ బాలకృష్ణ హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వినియోగం, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై ముత్తుకూరులోని మత్స్య కళాశాలలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుస్నేహాల వల్ల మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే విలువైన జీవితం అంధకారమవుతుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. ఎటువంటి తప్పులు చేయబోమంటూ ఈ సందర్భంగా వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రహ్మణియన్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

మంత్రి కాకాణికి కృతజ్ఞతలు



మనుబోలు మండల కేంద్రానికి చెందిన ముంగర మోహన్‌కృష్ణారెడ్డి అనే విద్యార్థి జగనన్న విదేశీ విద్యా దీవెనకు ఎంపికయ్యాడు. మొదటి విడత నిధులు మంజూరు కావడంతో విద్యార్థి తండ్రి ముంగర రవీంద్ర్‌రెడ్డి నెల్లూరులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

– మనుబోలు

శాశ్వత భూ హక్కులపై గ్రామసభ

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం శాశ్వత భూహక్కు పథకంపై రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివకృష్ణయ్య మాట్లాడుతూ రీసర్వే నిర్వహించి గ్రామసభ ద్వారా ప్రస్తుతం ఎవరు పొలాన్ని సాగు చేస్తున్నారో గుర్తించి ఆ రైతుకే పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేస్తామని తెలిపారు. ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో అఖిల్, సచివాలయ కన్వీనర్ గుంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ నిర్వహిస్తున్న అధికారులు

పోస్టర్ ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ (ఏపీవీటీయూఎస్సీ) ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న చలో తిరుపతి సీఎండీ కార్యాలయం పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, నగర అధ్యక్షుడు సూరిబాబు, హరినారాయణ పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 7న తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు లక్ష్మీనరసయ్య, కృష్ణ, నాగయ్య, ఆరీఫ్, శ్రీను, రవి, శ్రీనివాసులు, రసూల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గండవరంలో కేంద్ర బృందం పర్యటన

కొడవలూరు: మండలంలోని గండవరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం గురువారం పర్యటించింది. బృంద సమన్వయకర్త వేణుగోపాల్, డీపీఆర్‌సీ సభ్యులు మమత, పరదేశయ్య, మాధవి, ఈఓపీఆర్డీ వి.నాగరాజు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వినియోగం, గ్రామంలో మరుగుదొడ్ల వినియోగం, హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. సంపద తయారీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లు వందశాతం వినియోగిస్తుండడం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుద్ధ్యం బాగుండడం పట్ల బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ బీ.రాజకుమారి, పంచాయతీ కార్యదర్శులు ఎం.బ్రహ్మానందరెడ్డి, డి.సురేష్‌కుమార్, మహిళా పోలీస్ ఎస్.శిరీష, ఇంజినీరింగ్ సహాయకులు డి.వినోద్, వలంటీర్లు పాల్గొన్నారు.



ఎస్టీ కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం

అధైర్యపడొద్దు.. అండగా నేనున్నా..

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి
- ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం

బుచ్చిరెడ్డిపాళెం: ‘మీ సమస్యలు విన్నా.. అధైర్యపడొద్దు.. అండగా ఉన్నా..’ అంటూ పలువురికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భరోసా కల్పించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని 10, 11, 14, 15వ వార్డుల్లో ఉన్న పలు కుటుంబాలకు ఆయన అండగా నిలిచారు. ఆయా వార్డులకు చెందిన 8 మందికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల సాయాన్ని గురువారం పీర్ల చావిడి వద్ద అందజేశారు. ఇందులో పువ్వాడ చరణ్‌తేజ, పువ్వాడ నవదీప్‌ల పేరిట చెరో రూ.20 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయగా, మిగిలిన వారికి నగదు సాయం చేశారు.

రూ.1.50 కోట్లు మంజూరు

బుచ్చిరెడ్డిపాళెంలోని మోహన్‌బాబు ఆస్పత్రి నుంచి వెంకటేశ్వర స్వామి గుడి వరకు ఉన్న కాలువ వల్ల సమీపంలో నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని ప్రసన్న తెలిపారు. ఆ కాలువ ఇరువైపులా రక్షణగోడతో పాటు కాలువపై శ్లాబ్‌ను ఏర్పాటు చేసేందుకు నుడా నుంచి రూ.కోటి మంజూరు చేయించడం జరిగిందన్నారు. అలాగే మండలంలోని రెడ్డిపాళెంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నుడా నుంచి మరో రూ.50 లక్షలను మంజూరు చేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రమీలమ్మ, చీర్ల ప్రసాద్, షకీలాబేగం, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, శ్రీదేవి, శివకుమార్‌రెడ్డి, జయంతి, రహమత్, సత్యనారాయణ, అనంతలక్ష్మి, నాయకులు గుంటూరు వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, కావలి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌రెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు నగదు అందజేసిన ఎమ్మెల్యే ప్రసన్న

సంక్షేమ పాలన వల్లే పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీలో 200 మంది చేరిక

ఇందుకూరుపేట: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ఇతర పార్టీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని డేవిస్‌పేటలో రూ.24 లక్షలతో నిర్మించిన హెల్త్‌క్లినిక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాజీ సర్పంచ్ మేనాటి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ మేనాటి ప్రభావతి, వార్డు సభ్యులు నెల్లూరు వెంకటేశ్వర్లు, రాధమ్మ, పార్వతి, సుకుమార్‌రెడ్డి, సరస్వతి, పద్మ, చెంచయ్యతోపాటు 200 మంది ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాద్‌రెడ్డి చేరికతో గ్రామంలో బలం పెరిగిందన్నారు. అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా తమ పాలన సాగుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్బీకే వంటి వాటితో పాలన ప్రజల చెంతకు చేరిందన్నారు. చంద్రబాబు, పవన్ విమర్శలు అర్థరహితమన్నారు. నియోజకవర్గంలో 1.07 లక్షల గృహాలు ఉండగా 90 వేల గడపలు తిరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, పార్టీ నేతలు నెల్లూరు వెంకటరమణయ్య, కదురు చిన్నబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

నెల్లూరు(దర్గామిట్ట): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు తెలిపారు. గురువారం నెల్లూరులోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రచ్చబండ పేరుతో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెంకన్నపాళెం వెళ్లి గ్యాస్ ధర పెంపునకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కారణమని చెప్పడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి కక్ష సాధింపులకు తెరలేపారన్నారు. నకిలీ ఎరువులు అమ్మిన ప్రజాద్రోహి అన్నారు. యువజన శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సోమిరెడ్డి క్రికెట్ కిట్‌లు అమ్ముకున్నారన్నారు. నీరు – చెట్టు, వనం – మనం పథకాలతోపాటు ఇసుక, మట్టి, సిలికా, మిల్లర్లు, షిఫ్ట్ ఆపరేటర్లు , అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల్లో దోచుకున్నారన్నారు. గుడ్లూరుపాళెంలో సుబ్బారెడ్డి ప్రజా నాయకుడు కాదని 9 మంది గిరిజనుల బినామీ పేర్లతో రూ.9 లక్షలు స్వాహా చేశాడన్నారు. సమావేశంలో తోటపల్లిగూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, మాజీ జెడ్పీటీసీ చిరంజీవి గౌడ్, రమేష్‌రెడ్డి, చెరుకూరి శ్రీనివాసులునాయుడు, మల్లికార్జున, మల్లేశ్వర గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేంద్రబాబు

హెల్మెట్ విధిగా ధరించాలి

నెల్లూరు(క్రైమ్): ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌లు పీవీ నారాయణ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ట్రాఫిక్, పోలీసు అధికారులు గురువారం రాత్రి నెల్లూరు నగరంలో హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మంది తలకు తీవ్రగాయాలై మృతిచెందుతున్నారని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నారాయణ